www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | మంగళవారం, అక్టోబర్ 13,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:219 | పేజీలు: 8 | వెల: రూ.5/-

ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. దీని ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు, మహిళలకు కేటాయింపులు జరిగాయి.రాష్ట్రంలోని మొత్తం 17 కార్పొరేషన్లలో 5 స్థానాలను బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించారు. మరో 5 కార్పొరేషన్లను జనరల్ కేటగిరీ మహిళలకు రిజర్వ్ చేయగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా (రిజర్వేషన్ లేనివి) ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ఖరారుతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుందని భావిస్తున్నారు.ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి.

నాడు 'సైమన్ గోబ్యాక్'.. నేడు జ్ఞానేశ్

గోబ్యాక్

- సర్‌తో ఓటు చోరీకి మోదీ, షా, జ్ఞానేశ్ కుట్ర
- దీనిపై రాష్ట్రపతి, సీజేఐ స్పందించాలి
- రాజ్యాంగబద్ధ వ్యవస్థలు
- ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి
- ఢిల్లీలో మంత్రులు, ప్రజాప్రతినిధులతో రేవంత్

న్యూఢిల్లీ, అక్టోబరు 12(సామాన్యుడి అస్త్రం)



దేశానికి స్వాతంత్ర్యం కోసం ఒకప్పుడు 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం జరిగిందని, ఇప్పుడు ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని పేర్కొన్నారు. దేశ జనాభా పెరిగితే ఓటర్ల సంఖ్య పెరగాలని, కానీ.. ఓట్లు తొలగించడమేంటని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం (ఈసీ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలు ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఓటు చోరీ వ్యవహారంపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఓట్ బచావో.. దేశ్ బచావో ఆందోళనలో భాగంగా సోమవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గతంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని, అయితే 1950లో నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటుహక్కు లేనివారికి ఓటుహక్కు కల్పించారని తెలిపారు. తర్వాత ఇందిరాగాంధీ, వాజపేయి ప్రభుత్వాల కాలంలోనూ ఎస్ఐఆర్ జరిగిందని, కానీ.. ఆనాడు తాతలు, ముత్తాతలకు ఓటు ఉంటేనే అనే అర్థం పర్థం లేని కారణాలేమీ చూపలేదని పేర్కొన్నారు.


తిరుపతి స్వరూపం

మారనుంది

- తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన

వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం



అమరావతి,అక్టోబర్12,(సామాన్యుడి అస్త్రం)

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది.

కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోంది

- కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ



హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

కామారెడ్డిలో వింత దొంగతనం

- కామారెడ్డి జిల్లాలో ఎస్‌బీఐ ఏటీఎం చోరీ
- గ్యాస్ కట్టర్లతో ఏటీఎంను ధ్వంసం చేసి నగదు లూటీ

హైదరాబాద్((సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలోని కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో ఒక వింత దొంగతనం పోలీసులను విస్మయానికి గురిచేసింది. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు అంబులెన్సులో వచ్చి, నైటీలు ధరించి ఒక ఎస్‌బీఐ ఏటీఎంను కొల్లగొట్టారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే..
అక్టోబర్ 11న తెల్లవారుజామున 1 నుంచి 1:30 గంటల మధ్య ఈ ఘటన జరిగింది.



ఆధారాలతో ఈసీ వద్దకు వెళ్లండి

- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందన
- ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వ్యాఖ్య

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ఆందోళనల వల్ల రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిపక్ష నేతలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈరోజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఈటల... ప్రతిపక్షాల తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు.



బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం



- ఓట్లు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా మీ ముందుకే తెస్తానన్న పొన్నం
- ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని రాంచందర్ రావు డిమాండ్

హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా సవరణలో పేర్ల తొలగింపు అంశంపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ సవాల్ విసిరారు.ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు.



ఢిల్లీలో 'ఇండి'

నిరసన

- ఇండి కూటమి ర్యాలీతో ఢిల్లీలో ఆంక్షలు
- భద్రతా కారణాలతో ఆరు మెట్రో స్టేషన్ల మూసివేత

న్యూఢిల్లీ,((సామాన్యుడి అస్త్రం)

విపక్షాల 'ఇండి' కూటమి తలపెట్టిన నిరసన ర్యాలీ నేపథ్యంలో సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో మెట్రో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆరు కీలక మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) ప్రకటించింది.



జంతర్ మంతర్ వద్ద

నిరసనలు

న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)

దేశ రాజధానిలో నిరసనలకు చిరునామాగా ఉన్న జంతర్ మంతర్ విషయంలో ఢిల్లీ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై అక్కడ నిరసనలు నిర్వహించేందుకు అనుమతిని రద్దు చేశారు. నిరసనల కోసం ప్రత్యామ్నాయంగా మూడు ప్రాంతాలను ఎంపిక చేశారు. రామ్‌లీలా మైదాన్, బురారీ మైదాన్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్‌లను నిరసన వేదికలుగా ప్రకటించారు.

ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

- ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు
- ఈ మేరకు పురపాలక శాఖ నుంచి జీవో నెం. 252 జారీ

అమరావతి,అక్టోబర్12(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. దీని ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు, మహిళలకు కేటాయింపులు జరిగాయి.

రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్

- రేడియల్ రోడ్ టెండర్లలో అవకతవకలంటూ రాజగోపాల్ రెడ్డి ఆరోపణ
- రూ.600 కోట్లు తక్కువకు బిడ్ వేసినా తమను తప్పించారని మండిపాటు

హైదరాబాద్((సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.



నాడు 'సైమన్ గోబ్యాక్'.. నేడు జ్ఞానేశ్ గోబ్యాక్

మొదటి పేజి తరువాయి

ప్రత్యర్థులను దెబ్బ తీసేందుకే..

తమ అధికారానికి అడ్డుగా ఉన్న రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు మోదీ ప్రభుత్వం గతంలో ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ, నార్కోటిక్స్ విభాగం వంటి సంస్థలను ఉపయోగించుకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు వాటితో ప్రత్యర్థులను ఎదుర్కోవడం కష్టమవుతోందనే ఉద్దేశంతో ఎస్ఐఆర్‌ను తెరపైకి తెచ్చారని ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని, దానిని రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత దెబ్బతింటే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందన్నారు.గతంలో ఎన్నికల సంఘం ఒక్క కమిషనర్ నేతృత్వంలో పనిచేసేదని, అయితే ఈ సంస్థలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు నాటి ప్రధాని పీవీ నర్సింహారావు ముగ్గురు కమిషనర్ల విధానాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. గతంలో ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదని, అయితే మోదీ ప్రభుత్వం 2023లో ఈ విధానాన్ని మార్చిందని తెలిపారు. సీజేఐ స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చారని, నిర్ణయాలను తమకు అనుకూలంగా తీసుకునేందుకే ఈ మార్పులు చేశారని మండిపడ్డారు. జ్ఞానేశ్‌కుమార్‌ను సీఈసీగా నియమించే సమయంలోనే రాహుల్‌గాంధీ తీవ్ర అభ్యంతరం తెలిపారని గుర్తు చేశారు.

దళితుల ఓట్లను తొలగించే కుట్ర

దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజల ఓటు హక్కును తొలగించేందుకు కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశ యువత ఓట్లను తొలగించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి ఓటుహక్కును తొలగించే యోచనలో ఉందన్నారు. ఈ ప్రమాదాన్ని తొలుత గుర్తించి దేశ ప్రజల దృష్టికి తీసుకొచ్చింది రాహుల్ గాంధీయేనని వెల్లడించారు. ప్రతిపక్షాలే కాకుండా అధికార పక్షంలో ఉన్నవారు కూడా ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని, బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి వంటివారు దీనిపై గొంతెత్తడమే ఇందుకు నిదర్శనమని అన్నారు.

జ్ఞానేశ్‌కుమార్ నియామకంలో ఎలాంటి కుట్ర లేదని మోదీ, అమిత్ షా భావిస్తే.. ఆయనను తొలగించాలనే డిమాండ్లపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజలు ఆందోళనలు చేపడితే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. బీజేపీకి కొంతమేర బలం ఉన్న రాష్ట్రాల్లో ఆ పార్టీ విజయాలకు ఓటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులు కూడా కారణమనే అనుమానాలు ఉన్నాయన్నారు. 2014లో మోదీ తొలిసారి ప్రధానమంత్రి పదవికి పోటీ పడిన సమయంలో దేశంలో సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని రేవంత్ తెలిపారు. 2019లో ఈ సంఖ్య సుమారు 91 కోట్లకు, 2024 ఎన్నికల నాటికి సుమారు 97 కోట్లకు చేరిందని వివరించారు. 2026లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. తొలగించే ఓట్ల సంఖ్యను 20 కోట్లకు పెంచే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా పెరిగితే ఓటర్ల సంఖ్య పెరగాలా? తగ్గాలా? అన్నది సాధారణ ప్రశ్నేనని, దీనికి ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రెండు వర్గాలను సృష్టించే యత్నం..

దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు హక్కు లేనివారనే రెండు వర్గాలను సృష్టించే పరిస్థితి ఏర్పడుతోందని సీఎం రేవంత్ అన్నారు. సంపన్నులు బీజేపీకి మద్దతుగా ఉంటారని, పేదలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉంటారనే రాజకీయ లెక్కలతో ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఓటు హక్కును తొలగించడం ద్వారా కొన్ని వర్గాల ప్రజలను రెండో తరగతి పౌరులుగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో సాగుతున్న 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు, ఓటు హక్కును కాపాడేందుకు దోహదపడుతుందని అన్నారు.

తిరుపతి స్వరూపం మారనుంది..

మొదటి పేజి తరువాయి


రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది.



ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్..

మొదటి పేజి తరువాయి

తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు.టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు.గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

మొదటి పేజి తరువాయి

ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ ప్రక్రియలో పొరపాట్లు జరిగితే సరిదిద్దాల్సింది పోయి, బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.మంత్రి పొన్నం సవాల్‌పై స్పందించిన రాంచందర్ రావు...



ఓట్లు తొలగించబడినట్టు చెబుతున్న ఒక 10 మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఫసల్ బీమా యోజనలో చేరాలని ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తంమీద, ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలోని మొత్తం 17 కార్పొరేషన్లలో 5 స్థానాలను బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించారు. మరో 5 కార్పొరేషన్లను జనరల్ కేటగిరీ మహిళలకు రిజర్వ్ చేయగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా (రిజర్వేషన్ లేనివి) ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ఖరారుతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుందని భావిస్తున్నారు.

రిజర్వేషన్ల కేటాయింపు ఇలా ఉంది:

ఎస్టీ (ఒకటి): మంగళగిరి–తాడేపల్లి
ఎస్సీ (రెండు): రాజమహేంద్రవరం, కర్నూలు
బీసీ – మహిళ (రెండు): మచిలీపట్నం, కాకినాడ
బీసీ – జనరల్ (మూడు): అనంతపురం, చిత్తూరు, ఏలూరు
జనరల్ – మహిళ (ఐదు): విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం
అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు): తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జంతర్ మంతర్ వద్ద నిరసనలు

మొదటి పేజి తరువాయి



ఢిల్లీ పోలీసుల స్టాండింగ్ ఆర్డర్ నంబర్ ఎల్‌డబ్ల్యూ/48/2026 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసుల మేరకు జంతర్ మంతర్‌ను నిర్దేశిత నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించినట్లు పోలీసులు వెల్లడించారు. కొత్తగా ఎంపిక చేసిన మూడు ప్రాంతాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించేందుకు సంబంధించిన సవరించిన మార్గదర్శకాలను విడిగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. గతంలో జారీ చేసిన 2022 ఏప్రిల్ 28 నాటి స్టాండింగ్ ఆర్డర్‌లో కొంతమేర మార్పులు చేసినట్లు పేర్కొన్నారు.భారత ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష కూటమితో పాటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలకు సిద్ధమైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పైగా ఈరోజే పోలీసులను కలిసిన సీజేపీ నేతలు.. జంతర్ మంతర్ వద్ద నిరసన ఏరోజు చేపట్టాలో పోలీసులే చెప్పాలని కోరారు. అందుకు 24 గంటల అల్టిమేటం కూడా జారీ చేశారు. ఇంతలోనే పోలీసుల నుంచి తాజా నిర్ణయం వెలువడడం గమనార్హం.

ఆధారాలతో ఈసీ వద్దకు వెళ్లండి



మొదటి పేజి తరువాయి

ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేవారు, అందుకు సంబంధించిన ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని ఈటల సూచించారు. "ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుని, మీ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించండి. అంతేగానీ, ఇలా రోడ్లెక్కి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు" అని ఆయన అన్నారు. గతంలో బీహార్‌లో 'ఓట్ల దొంగతనం' జరిగిందని ఇలాగే ఆరోపించారని, కానీ దాని ఫలితం ఏమైందో గుర్తుచేసుకోవాలని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి ఇండియా కూటమి గుణపాఠం నేర్చుకోవాలని ఈటల హితవు పలికారు.ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోరాడటం నేర్చుకోవాలని ఆయన సూచించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ – మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఇండియా కూటమి సుప్రీంకోర్టుకు పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు, కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు.

కామారెడ్డిలో వింత దొంగతనం..

మొదటి పేజి తరువాయి

సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు
నైటీలతో అంబులెన్సులో వచ్చి, ఏటీఎం లూటీ!
ఇటీవల కరీంనగర్‌లోనూ ఇదే తరహా ఘటనలు

వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 11న తెల్లవారుజామున 1 నుంచి 1:30 గంటల మధ్య ఈ ఘటన జరిగింది. దుండగులు ముఖాలకు మాస్కులు, ఒంటిపై నైటీలు వేసుకుని అంబులెన్సులో వచ్చారు. గ్యాస్ కట్టర్ల సాయంతో ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి, అందులోని నగదును దోచుకెళ్లారు. ఈ దృశ్యాలన్నీ అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి.ఉదయం ధ్వంసమైన ఏటీఎంను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. చోరీకి ఉపయోగించిన అంబులెన్స్ నిజమైనదా? లేక పోలీసులను తప్పుదోవ పట్టించడానికి ఉపయోగించారా? అనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు.ఏటీఎంలో ఎంత నగదు చోరీకి గురైందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. బ్యాంకు అధికారుల లెక్కల తర్వాతే నష్టం ఎంతనేది తెలుస్తుంది. కాగా, సెప్టెంబర్ 19న కరీంనగర్ శివార్లలోని దుర్శేడ్, తిమ్మాపూర్ వద్ద రెండు ఎస్‌బీఐ ఏటీఎంలలోనూ ఇదే తరహాలో దొంగతనాలు జరిగాయి. అక్కడ కూడా దుండగులు మహిళల దుస్తులు ధరించి, గ్యాస్ కట్టర్లు వాడటం గమనార్హం.



ప్లాన్ ఒకటి.. కట్టింది మరొకటా? సైబరాబాద్‌లో భవనాలకు

మళ్లీ తనిఖీలు!



- అనుమతులు తీసుకుని నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై సీఎంసీ నజర్!
- మంజూరైన ప్లాన్‌కు అనుగుణంగా నిర్మించారా?..
- పాత అనుమతులనూ పరిశీలించేందుకు కసరత్తు
- అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ ఉల్లంఘనలు, అక్రమ విస్తరణలపై ప్రత్యేక దృష్టి
- క్యూర్ చట్టం అమలు నేపథ్యంలో కఠిన చర్యలకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిద్ధం!

సామాన్యుడి అస్త్రం / సైబరాబాద్ :

భవన నిర్మాణానికి అనుమతి ఉందా? ఉంటే ఏ ప్లాన్‌కు తీసుకున్నారు? కట్టింది కూడా అదే ప్లాన్ ప్రకారమేనా? ఇకపై ఇలాంటి ప్రశ్నలకు భవన యజమానులు సమాధానం చెప్పాల్సి రావచ్చు. అనుమతులు ఒకలా తీసుకుని, నిర్మాణాలు మరోలా చేపట్టిన వారిపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) దృష్టి సారించింది. ఇప్పటికే నిర్మాణ అనుమతులు పొందిన భవనాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అనుమతి పొందిన విస్తీర్ణానికి మించి నిర్మించారా? అనుమతి లేకుండా అదనపు అంతస్తులు వేశారా? సెట్‌బ్యాక్‌లను వదిలారా? పార్కింగ్ స్థలాన్ని ఇతర అవసరాలకు మళ్లించారా? అనే అంశాలపై ఆరా తీయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. క్యూర్ చట్టం అమలులోకి వచ్చిన నేపథ్యంలో అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలను మరింత కట్టుదిట్టం చేసే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అనుమతి రెండు అంతస్తులకు.. నిర్మాణం ఐదంతస్తులా?

భవన నిర్మాణ అనుమతులు పొందిన తర్వాత కొందరు యజమానులు ఆమోదించిన ప్లాన్‌ను పక్కనపెట్టి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలు కొత్తవి కావు. రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని అదనంగా మరికొన్ని అంతస్తులు నిర్మించడం, ఖాళీగా వదలాల్సిన సెట్‌బ్యాక్ స్థలాన్ని కూడా నిర్మాణంలో కలిపేయడం, పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో దుకాణాలు లేదా ఇతర నిర్మాణాలు చేపట్టడం వంటి ఉల్లంఘనలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో కేవలం భవన నిర్మాణ అనుమతి పత్రం ఉందని చూపించడం సరిపోదని, మంజూరైన ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణం జరిగిందా లేదా అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ తనిఖీలు అమలైతే అనుమతి తీసుకున్న ప్రతి భవనం నిబంధనలను పాటించిందా అన్న విషయంపై మరింత స్పష్టత వచ్చే అవకాశముంది.

పాత అనుమతుల ఫైళ్లూ బయటకు!

ఇప్పటివరకు అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలు, ఫిర్యాదులు అందిన భవనాలపై ప్రధానంగా దృష్టి సారించిన అధికారులు, ఇకపై ఇప్పటికే అనుమతులు జారీ చేసిన నిర్మాణాలను కూడా పరిశీలించే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.భవన నిర్మాణ అనుమతి దరఖాస్తులో చూపిన స్థల విస్తీర్ణం, మంజూరైన అంతస్తుల సంఖ్య, భవనం ఎత్తు, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ వివరాలను క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులతో పోల్చి చూడడం ఈ ప్రక్రియలో కీలకం కానుంది. ఇందుకోసం పాత అనుమతి ఫైళ్లు, ఆమోదిత ప్లాన్లు, సంబంధిత రికార్డులను పరిశీలించాల్సి ఉంటుంది.అయితే ఈ తనిఖీలను ఏ తేదీ నుంచి ప్రారంభిస్తారు? తొలిదశలో ఎన్ని భవనాలను పరిశీలిస్తారు? జోన్‌ల వారీగా ప్రత్యేక బృందాలను నియమిస్తారా? అన్న వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

అక్రమ నిర్మాణాలకు క్యూర్ చట్టంతో చెక్?

కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో మున్సిపల్ పాలనకు కొత్త చట్టపరమైన వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో అనధికార నిర్మాణాల నియంత్రణ, భవన అనుమతుల పరిశీలన, నిబంధనల అమలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు సమాచారం.క్యూర్ చట్టంలోని సెక్షన్ 168ను అక్రమ నిర్మాణాలపై చర్యల విషయంలో కీలకంగా పరిగణిస్తున్నట్లు ప్రచురిత కథనం పేర్కొంది. అయితే నిర్దిష్ట భవనంపై ఏ సెక్షన్ ప్రకారం చర్య తీసుకోవాలన్నది అమల్లో ఉన్న చట్ట నిబంధనలు, ఉల్లంఘన స్వరూపం, వర్తించే విధివిధానాల ఆధారంగా నిర్ణయించాల్సి ఉంటుంది.నిర్మాణ అనుమతులు లేకుండా చేపట్టిన కట్టడాలతో పాటు మంజూరైన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలపైనా అధికారులు దృష్టి పెట్టే అవకాశం కనిపిస్తోంది.

కూల్చివేతలతో సరిపెడతారా.. మూలాలను తేలుస్తారా?

సైబరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో నిబంధనల ఉల్లంఘనలు ఆగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు కూల్చివేత చర్యలు చేపడుతున్నా, మరోవైపు కొత్త అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.దీంతో అక్రమ నిర్మాణం పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడంకంటే, నిర్మాణ దశలోనే ఉల్లంఘనలను గుర్తించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా అనుమతులు జారీ చేసిన తర్వాత వాటి అమలును పర్యవేక్షించాల్సిన టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం ఎంతవరకు పనిచేసిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఒక భవనానికి అనుమతి ఇచ్చిన అధికారి ఎవరు? ఆమోదించిన ప్లాన్‌లో ఎన్ని అంతస్తులు ఉన్నాయి? క్షేత్రస్థాయిలో ఎన్ని నిర్మించారు? మధ్యలో అధికారులు ఎన్నిసార్లు తనిఖీలు నిర్వహించారు? ఉల్లంఘనలు గుర్తిస్తే నోటీసులు ఇచ్చారా? అన్న వివరాలు కూడా వెలుగులోకి రావాల్సి ఉంది.

అధికారుల పాత్రపైనా విచారణ అవసరం!

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం ఎంత ముఖ్యమో, అవి నిర్మాణ దశలో ఉన్నప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారుల పనితీరును పరిశీలించడం కూడా అంతే ముఖ్యం. ఒకటి రెండు రోజుల్లో బహుళ అంతస్తుల భవనం నిర్మాణం పూర్తికాదు. నెలల తరబడి నిర్మాణ పనులు కొనసాగుతాయి. అలాంటప్పుడు నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా అధికారుల దృష్టికి ఎందుకు రాలేదన్నది సహజంగానే తలెత్తే ప్రశ్న.క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారా? నిర్వహిస్తే ఆ నివేదికలు ఏమయ్యాయి? ఉల్లంఘనలు గుర్తించిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న అంశాలను కూడా పరిశీలిస్తేనే ఈ ప్రక్రియకు పూర్తిస్థాయిలో ఫలితం దక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉల్లంఘనలు గుర్తిస్తే చర్యలు

వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా భవన నిర్మాణ అనుమతులు, ఆమోదించిన ప్లాన్లు, క్షేత్రస్థాయిలో ఉన్న నిర్మాణాలను అధికారులు పరిశీలించనున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే సంబంధిత చట్టాల ప్రకారం నోటీసులు జారీ చేయడం, వివరణలు కోరడం, అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టడం వంటి అంశాలను పరిశీలించే అవకాశముంది.అయితే ప్రతి నిర్మాణ ఉల్లంఘనకూ ఒకే విధమైన చర్య వర్తించదు. ఉల్లంఘన తీవ్రత, చట్టపరమైన నిబంధనలు, న్యాయస్థానాల ఉత్తర్వులను అనుసరించి అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

అక్రమ నిర్మాణాల జాబితా బయటపెడతారా?

సైబరాబాద్‌లో అక్రమ నిర్మాణాల నియంత్రణకు చేపట్టనున్న తనిఖీలు ఎంతవరకు ఫలితాన్నిస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అనుమతులు తీసుకున్న నిర్మాణాల్లో ఎన్ని నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయి? ఎన్ని భవనాల్లో ఉల్లంఘనలు గుర్తించారు? ఎన్ని నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారు? ఎన్ని భవనాలపై చర్యలు తీసుకున్నారు? అన్న వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.అనుమతి పత్రాల్లో ఉన్న ప్లాన్ ఒకటి.. క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న నిర్మాణం మరొకటైతే బాధ్యత ఎవరిది? నిర్మాణం చేపట్టిన యజమానిదా? లేక నిబంధనల అమలును పర్యవేక్షించాల్సిన అధికారులదా? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికినప్పుడే అక్రమ నిర్మాణాల నియంత్రణకు చేపడుతున్న కొత్త చర్యలకు అసలైన అర్థం ఉంటుంది.

సర్వే రిపోర్టుకు రూ.30 లక్షల బేరం.. రూ.20 లక్షల లంచంతో

ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, సర్వేయర్!



- సర్వే రిపోర్టుకు రూ.30 లక్షల బేరం.. రూ.20 లక్షల లంచంతో ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, సర్వేయర్!
- జాయింట్ సర్వే రిపోర్టు కోసం లక్షల్లో డిమాండ్.. రెవెన్యూ శాఖలో కలకలం
- రూ.30 లక్షలు డిమాండ్ చేసి.. చివరకు రూ.20 లక్షలకు దిగొచ్చినట్లు ఏసీబీ వెల్లడి
- తహసీల్దార్ ఆదేశాలతో లంచం తీసుకుంటూ పట్టుబడిన మండల సర్వేయర్ శ్రీనివాసులు
- లంచం సొమ్ము స్వాధీనం.. తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో సహా ఇద్దరి అరెస్టు

సామాన్యుడి అస్త్రం / అబ్దుల్లాపూర్‌మెట్ :

భూమిని సర్వే చేసి నివేదిక ఇవ్వాలంటే రూ.30 లక్షలు కావాలట! అంత ఇచ్చుకోలేమంటే చివరకు రూ.20 లక్షలకు దిగొచ్చారట! ప్రభుత్వ విధుల్లో భాగంగా చేయాల్సిన పనికి లక్షల్లో లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు రెవెన్యూ అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు చిక్కారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో సోమవారం జరిగిన ఈ ఘటన రెవెన్యూ శాఖలో కలకలం రేపింది. లేఅవుట్‌కు సంబంధించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే రిపోర్టు జారీ చేసేందుకు భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు తేలడంతో మండల తహసీల్దార్ బి.సుదర్శన్‌రెడ్డి, మండల సర్వేయర్ బటుక శ్రీనివాసులును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

సర్వే నివేదికకు రూ.30 లక్షల డిమాండ్!


అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని ఓ లేఅవుట్‌కు సంబంధించి హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం భూమిని సర్వే చేసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే రిపోర్టు ఇవ్వాల్సి ఉంది. ఈ పని కోసం సంబంధిత వ్యక్తిని రెవెన్యూ అధికారులు భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. మొదట రూ.30 లక్షలు ఇవ్వాలని కోరగా, చివరకు రూ.20 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు తెలిపింది. ప్రభుత్వ విధుల్లో భాగంగా ఇవ్వాల్సిన సర్వే నివేదిక కోసం ఇంత భారీ మొత్తం డిమాండ్ చేయడం తీవ్ర చర్చకు దారితీసింది.

తహసీల్దార్ ఆదేశాలతోనే వసూలు!

లంచం డిమాండ్‌తో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఫిర్యాదును పరిశీలించిన అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో బాధితుడి నుంచి రూ.20 లక్షలు స్వీకరిస్తుండగా మండల సర్వేయర్ బటుక శ్రీనివాసులును ఏసీబీ సీఐయూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకే సర్వేయర్ ఈ డబ్బులు తీసుకున్నట్లు ఏసీబీ తన అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ వ్యవహారంలో తహసీల్దార్ పాత్ర ఉందని గుర్తించిన అధికారులు ఆయనను కూడా అరెస్టు చేశారు.

చేతులకు రసాయన పరీక్ష.. రూ.20 లక్షలు స్వాధీనం

సర్వేయర్ శ్రీనివాసులు వద్ద నుంచి రూ.20 లక్షల లంచం సొమ్మును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన చేతివేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షలో పాజిటివ్ ఫలితం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఇద్దరు అధికారులు తమ ప్రభుత్వ విధులను దుర్వినియోగం చేసి అక్రమంగా ఆర్థిక ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ ఆరోపించింది. నిందితులను హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచే ప్రక్రియ చేపట్టినట్లు అధికారిక ప్రకటనలో వెల్లడించింది.



Press Note No.155 Date: 12.10.2026

TAHSILDAR AND MANDAL SURVEYOR OF ABDULLAPURMET MANDAL, RANGA REDDY DISTRICT ARE IN ACB NET.

On 12.10.2024 on evening hours, AO-1 Sri Batuka Srinivasulu, Mandal Surveyor and AO-2 Sri B. Sudershan Reddy, Tahsildar, of Abdullapurmet Mandal, Ranga Reddy District, were caught by ACB, CIU. AO-1 was apprehended near Abdullapurmet (V) & (M) while accepting the bribe amount of ₹20,00,000/- from the complainant on the instructions of AO-2, for doing an official favour i.e., to conduct the survey and issue a Joint Inspection Survey Report for layout under HMDA guidelines. The Accused Officers had initially demanded a bribe of ₹30,00,000/-, which was later reduced to ₹20,00,000/-.

The bribe amount was recovered from the possession of AO-1 at his instance. Both hand fingers of AO-1 yielded positive results in the chemical test. Thus, AO-1 and AO-2 performed their public duty improperly and dishonestly.

AO-1Sri Batuka Srinivasulu, Mandal Surveyor and AO-2 Sri B. Sudershan Reddy, Tahsildar, Abdullapurmet, Ranga Reddy District, are being arrested and produced before the Hon'ble Principal Special Judge for SPE & ACB Cases, Nampally, Hyderabad. The case is under investigation. The details of the complainant are withheld for security reasons.

Call Phone Number -1064 (Toll-free Number)

In case of a demand for a bribe by any Public Servant, the public is requested to contact the ACB Toll Free Number, i.e., 1064, to take action as per Law. ACB Telangana can also be contacted through social media platforms WhatsApp (9440446106), Facebook (Telangana ACB), and X (X/formerly twitter (@Telangana ACB). The QR Code of ACB is also displayed in all Government Offices and prominent public places to contact ACB, Telangana. The name and details of the victim/complainant will be kept secret.

PRO, 12/10/24
Anti Corruption Bureau,
T.S., Hyderabad.

భూ సర్వేల పేరుతో ఇంకెన్ని వసూళ్లు?

ఒక్క జాయింట్ సర్వే నివేదికకే రూ.30 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం రెవెన్యూ శాఖ పనితీరుపై కొత్త ప్రశ్నలు లేవనెత్తుతోంది. భూముల హద్దులు నిర్ధారించడం, సర్వే నివేదికలు ఇవ్వడం, లేఅవుట్లకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించడం వంటి కీలక బాధ్యతలు రెవెన్యూ అధికారుల చేతుల్లో ఉంటాయి. అలాంటి అధికారులే లంచం కోసం డిమాండ్ చేస్తే సామాన్యులకు న్యాయం ఎలా అందుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ ఒక్క లావాదేవీకే ఈ వ్యవహారం పరిమితమైందా? గతంలో జారీ చేసిన సర్వే నివేదికల్లోనూ అక్రమాలు జరిగాయా? ఎలాంటి లేఅవుట్‌కు సంబంధించిన నివేదిక కోసం ఈ మొత్తం డిమాండ్ చేశారు? సంబంధిత భూమి సర్వే రికార్డులు, అనుమతుల దరఖాస్తులు ఏమి చెబుతున్నాయి? అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. ప్రస్తుతానికి ఇతర నివేదికల్లో అవకతవకలు జరిగినట్లు ఏసీబీ ధ్రువీకరించలేదు.



విచారణలో బయటపడాల్సిన వాస్తవాలు

లంచం వ్యవహారంపై ఏసీబీ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాధితుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచారు. ఇద్దరు అధికారులపై నమోదైన కేసులో తదుపరి దర్యాప్తు, న్యాయస్థాన ప్రక్రియల ద్వారా మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆరోపణలపై తుది నిర్ధారణ న్యాయ విచారణలో జరగాల్సి ఉంది.

సెప్టెంబరులో 25,392 యూనిట్లతో బాలెనో అగ్రస్థానం



బాలెనో అమ్మకాల్లో ఏడాది ప్రాతిపదికన 93 శాతం వృద్ధి
టాటా నెక్సాన్ 20,456 యూనిట్లతో రెండో స్థానం
టాటా పంచ్ 20,333 యూనిట్లతో మూడో స్థానం
టాప్-10లో మారుతీ సుజుకీకి చెందిన ఆరు మోడళ్లు

హైదరాబాద్, అక్టోబర్12,(సామాన్యుడి అస్త్రం)

దేశీయ కార్ల మార్కెట్లో మారుతి సుజుకి బాలెనో దూసుకెళ్లింది. 2026 సెప్టెంబరులో దేశంలోనే అత్యధికంగా అమ్ముడైన ప్యాసింజర్ కారుగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే ఏకంగా 93 శాతం వృద్ధిని నమోదు చేసింది. టాటా నెక్సాన్, పంచ్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. టాప్-10 కార్ల జాబితాలో మారుతి సుజుకికి చెందిన ఆరు మోడళ్లు చోటు దక్కించుకున్నాయి.సెప్టెంబరులో మారుతి సుజుకి బాలెనో 25,392 యూనిట్లను డీలర్లకు పంపించింది. గత ఏడాది ఇదే నెలలో 13,173 యూనిట్లు మాత్రమే నమోదయ్యాయి. దీంతో ఏడాది ప్రాతిపదికన 93 శాతం వృద్ధి సాధించింది. టాప్-10 కార్లలో ఇదే అత్యధిక వృద్ధి కావడం విశేషం.టాటా నెక్సాన్ 20,456 యూనిట్లతో రెండో స్థానంలో నిలిచింది. అయితే గత ఏడాది సెప్టెంబరులో నమోదైన 22,573 యూనిట్లతో పోలిస్తే అమ్మకాలు 9 శాతం తగ్గాయి. టాటా పంచ్ 20,333 యూనిట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ మోడల్ అమ్మకాలు 28 శాతం పెరిగాయి.టాప్-10 జాబితాలో బాలెనో, ఫ్రాంక్స్, వ్యాగనార్, డిజైర్, స్విఫ్ట్, ఎర్టిగా సహా మారుతి సుజుకీకి చెందిన ఆరు మోడళ్లు ఉన్నాయి. ఫ్రాంక్స్ 19,282 యూనిట్లతో 40 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఎర్టిగా 16,911 యూనిట్ల అమ్మకాలతో అదే స్థాయిలో వృద్ధిని కనబరిచింది.టాటా నెక్సాన్, పంచ్ కలిపి 40,789 యూనిట్లను నమోదు చేశాయి. కాంపాక్ట్ ఎస్‌యూవీలకు మార్కెట్లో ఉన్న ఆదరణను ఈ గణాంకాలు చాటుతున్నాయి. మరోవైపు హ్యాచ్‌బ్యాక్ కార్లకూ డిమాండ్ తగ్గలేదు. బాలెనో, వ్యాగనార్, స్విఫ్ట్ కలిపి 61 వేలకుపైగా యూనిట్లను నమోదు చేశాయి.టాప్-10 జాబితాలో హ్యుందాయ్ క్రెటా ఏడో స్థానంలో నిలిచింది. ఈ మోడల్ 17,657 యూనిట్లను నమోదు చేసింది. మహీంద్రా స్కార్పియో 17,313 యూనిట్లతో తొమ్మిదో స్థానాన్ని దక్కించుకుంది.2026 సెప్టెంబరులో అత్యధికంగా అమ్ముడైన టాప్-10 కార్ల మొత్తం డిస్పాచ్‌లు 1,91,332 యూనిట్లకు చేరాయి. గత ఏడాది ఇదే నెలలో ఈ సంఖ్య 1,63,725గా ఉంది. దీంతో ఏడాది ప్రాతిపదికన 17.2 శాతం వృద్ధి నమోదైంది. హ్యాచ్‌బ్యాక్‌లు, ఎస్‌యూవీలు సహా పలు విభాగాల్లో డిమాండ్ కొనసాగుతున్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

మెట్రో-ఆర్టీసీ కామన్ కార్డ్ ధరలపై పునరాలోచన.. సమీక్షకు తెలంగాణ సర్కార్ నిర్ణయం

విమర్శలతో వెనక్కి తగ్గిన తెలంగాణ ప్రభుత్వం
మెట్రో-ఆర్టీసీ కామన్ కార్డ్ ధరల పునఃసమీక్షకు నిర్ణయం
ప్రస్తుత నెలవారీ ఛార్జీ రూ.8,500గా ఉండటంపై అభ్యంతరాలు
సామాన్యులకు అందుబాటులోకి తెస్తామన్న మంత్రి పొన్నం ప్రభాకర్
త్వరలో అధికారులతో సమావేశమై తుది నిర్ణయం

హైదరాబాద్, అక్టోబర్12,(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఇటీవల ప్రవేశపెట్టిన 'కామన్ మొబిలిటీ కార్డ్' ధరలపై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నెలవారీ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించడంపై ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో, ఛార్జీలను సమీక్షించాలని సర్కార్ నిర్ణయించింది. సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరలను మార్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు ప్రకటించింది.అక్టోబర్ 2న ఈ కామన్ కార్డ్‌ను ప్రారంభించారు. అయితే, దీని ధరలు సామాన్యులకు పెనుభారంగా ఉన్నాయన్న అభిప్రాయాలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచన మేరకు ఛార్జీల సమీక్షకు నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం తెలిపారు. త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై, ధరలను తగ్గించే విషయంపై చర్చిస్తామని ఆయన వెల్లడించారు.ప్రస్తుత నిబంధనల ప్రకారం, రోజువారీ పాస్ ధర రూ.400, నెలవారీ పాస్ ధర రూ.8,500గా ఉంది. నెలవారీ పాస్‌లో మెట్రోకు రూ.7,000, ఆర్టీసీకి రూ.1,500గా విభజించారు. కార్డు తీసుకునేటప్పుడు రూ.100 రిఫండబుల్ డిపాజిట్ కూడా చెల్లించాలి. అధికారులతో జరగబోయే సమావేశం తర్వాత కొత్త ధరలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే, సమీక్ష ఎప్పటిలోగా పూర్తవుతుంది, కొత్త ధరలు ఏ మేరకు తగ్గుతాయనే దానిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.



ఎస్సెస్సీ--ఇంటర్ బోర్డుల విలీనానికి బ్రేక్?..

సీఎం వద్దే ఫైలు!

2027--28 విద్యా సంవత్సరం నుంచైనా అమలయ్యేనా?.. ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

- **విలీన ప్రతిపాదనపై వెనక్కి తగ్గుతున్నారా?.. పెండింగ్‌లో కీలక ఫైలు**
- **ఇంటర్ బోర్డు ఉద్యోగులు, అధ్యాపకుల నుంచి తీవ్ర వ్యతిరేకత**
- **పాలిటెక్నిక్ విలీనంపై వెనకడుగు నేపథ్యంలో ఎస్సెస్సీ--ఇంటర్ విలీనంపైనా సందిగ్ధం**



సామాన్యుడి అస్త్రం / తెలంగాణ బ్యూరో

విద్యా వ్యవస్థలో భారీ మార్పులు తీసుకురావాలన్న ప్రభుత్వ ఆలోచనకు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయా? పదో తరగతి, ఇంటర్మీడియట్ బోర్డులను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న ప్రతిపాదన అటకెక్కిందా? వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా ఈ విధానం అమలవుతుందా? ఇప్పుడు విద్యాశాఖ వర్గాల్లో ఇదే చర్చ సాగుతోంది. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ బోర్డుల విలీనానికి సంబంధించిన ఫైలు ముఖ్యమంత్రి వద్దకు చేరినప్పటికీ తుది నిర్ణయం వెలువడకపోవడంతో ప్రతిపాదన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు విలీనాన్ని ఇంటర్ బోర్డు ఉద్యోగులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం ప్రభుత్వానికి సవాలుగా మారింది.

ఎనిమిది నుంచి పన్నెండో తరగతి వరకు ఒకే విధానం!

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ బోర్డులను విలీనం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. కేంద్రం సూచించిన విద్యా సంస్కరణల దిశగా ఎనిమిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు విద్యార్థులకు ఒకే విద్యా వ్యవస్థలో బోధన అందించే అవకాశాలను పరిశీలించింది. ప్రస్తుతం పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ ప్రత్యేక విద్యా విధానంగా కొనసాగుతోంది. ఈ రెండు దశలను అనుసంధానం చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.ప్రత్యేకంగా రెండేళ్ల ఇంటర్మీడియట్ విద్య కార్పొరేట్ కళాశాలల ఆధిపత్యంలోకి వెళ్లిందని, పదో తరగతి తర్వాత కొందరు విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడుతున్నట్లు ప్రచురిత కథనం పేర్కొంది. పదో తరగతిలో కనిపిస్తున్న ఉత్తీర్ణత శాతం ఇంటర్మీడియట్‌కు వచ్చేసరికి తగ్గిపోవడంపైనా సమీక్ష అవసరమని భావిస్తున్నారు. అయితే ఈ సమస్యల పరిష్కారానికి బోర్డుల విలీనమే సరైన మార్గమా అన్న ప్రశ్నకు ఇంకా స్పష్టమైన సమాధానం లభించలేదు.

ఫైలు సిద్ధం.. నిర్ణయం మాత్రం పెండింగ్!

ఎస్సెస్సీ, ఇంటర్ బోర్డుల విలీనాన్ని గత విద్యా సంవత్సరంలోనే ముందుకు తీసుకెళ్లాలని భావించినా, ఫైలు కదలికలో జాప్యం జరిగినట్లు సమాచారం. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రక్రియ పూర్తి చేసి తదుపరి విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలనే ఆలోచన కూడా ముందుకొచ్చింది.ఈ మేరకు విద్యాశాఖ వర్గాలు విలీనానికి సంబంధించిన ఫైలును సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే తుది ఆమోదం లభించకపోవడంతో ఫైలు పెండింగ్‌లోనే ఉన్నట్లు ప్రచురిత కథనం వెల్లడించింది. దీనిపై ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం ప్రకటించాల్సి ఉంది.

బోర్డులను కలిపేస్తే సమస్యలు తీరుతాయా?

విలీన ప్రతిపాదనపై ఇంటర్ బోర్డు ఉద్యోగులు, అధ్యాపకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యలో లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలి తప్ప మొత్తం వ్యవస్థనే మార్చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.కార్పొరేట్ విద్యా సంస్కృతి తెలంగాణకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా ఉందని గుర్తుచేస్తున్నారు. విద్యార్థుల డ్రాపౌట్లు, ఉత్తీర్ణత శాతం తగ్గుదల వంటి సమస్యలకు కారణాలను సమగ్రంగా అధ్యయనం చేయకుండా బోర్డులను విలీనం చేయడం వల్ల ఆశించిన ఫలితాలు వస్తాయన్న హామీ ఏమిటని ప్రశ్నిస్తున్నారు.ముఖ్యంగా గురుకులాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో చదివే పరిమిత సంఖ్యలోని విద్యార్థుల ఫలితాలను లక్షలాది మంది చదివే ఇంటర్మీడియట్ వ్యవస్థతో నేరుగా పోల్చడం సరైన పద్ధతి కాదన్న వాదన వినిపిస్తోంది.

లోపాలు సరిదిద్దండి.. బోర్డును ఎందుకు మార్చాలి?

ఇంటర్మీడియట్ విద్యకు అవసరమైన నిధులు, మౌలిక వసతులు, అధ్యాపకుల నియామకాలు, విద్యార్థులకు విద్యాపరమైన సహకారం అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అధ్యాపక సంఘాలు చెబుతున్నాయి.ఇంటర్ విద్యకు గురుకులాలతో సమానంగా కాకపోయినా అవసరాలకు తగిన బడ్జెట్ కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమని ఇంటర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నట్లు ప్రచురిత కథనం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో అమలైన విద్యా మార్పుల ఫలితాలనూ సమీక్షించాలని అధ్యాపక వర్గాలు కోరుతున్నాయి. ఇంటర్మీడియట్‌లో సమస్యలుంటే పరిష్కరించాలే తప్ప మొత్తం వ్యవస్థను మార్చడం సరికాదన్నది వారి వాదన.

పాలిటెక్నిక్ నిర్ణయంతో కొత్త సందేహాలు!

ఇటీవల పాలిటెక్నిక్ విద్యను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనపై ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు వచ్చిన వార్తలు కూడా ఈ చర్చకు కారణమయ్యాయి. ఆ ప్రతిపాదనపై వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం పునరాలోచన చేసినట్లు సమాచారం.అదే తరహాలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ బోర్డుల విలీనంపైనా ప్రభుత్వం వెనక్కి తగ్గే అవకాశముందా అన్న చర్చ మొదలైంది. అయితే పాలిటెక్నిక్ విషయంలో తీసుకున్న నిర్ణయాన్నే ఇంటర్ బోర్డు విషయంలోనూ తీసుకుంటారని చెప్పడానికి ఇప్పటివరకు అధికారిక ఆధారాలు లేవు.

2027--28లోనూ అమలు కష్టమేనా?

ఇప్పటికీ విలీనంపై స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడంతో 2027--28 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం అమలవుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బోర్డుల విలీనం అంటే కేవలం రెండు కార్యాలయాలను కలపడం మాత్రమే కాదు. సిలబస్, పరీక్షల నిర్వహణ, పరిపాలన, సిబ్బంది విధులు, కళాశాలల వ్యవస్థ వంటి అనేక అంశాలపై నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.ముందుగా విధానపరమైన నిర్ణయం తీసుకుని, అవసరమైన ఉత్తర్వులు జారీ చేసి, అమలుకు తగిన సమయం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో వచ్చే విద్యా సంవత్సరానికి విలీనం సాధ్యమవుతుందా అన్న అనుమానాలు నెలకొన్నాయి.ప్రభుత్వం విలీన ప్రతిపాదనను పూర్తిగా విరమించుకుంటుందా? లేక అధ్యాపకుల అభ్యంతరాలను పరిశీలించి మార్పులతో అమలు చేస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులలో నెలకొన్న సందిగ్ధానికి తెరదించాలంటే విలీనంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాల్సిన అవసరం ఉంది.

ఉక్రెయిన్ యుద్ధంలో తెలంగాణ వాసి మృతి.. కుటుంబానికి అండగా రేవంత్ సర్కారు

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో జగిత్యాల వాసి సుదర్శన్ గౌడ్ మృతి
మృతుడి కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం రేవంత్
ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లిన బాధితుడు
మృతదేహాన్ని స్వదేశానికి తెచ్చేందుకు అధికారులకు ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్12,(సామాన్యుడి అస్త్రం)

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ వాసి కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. జగిత్యాల జిల్లా, హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ మృతిచెందగా, అతడి కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ప్రకటించారు.వివరాల్లోకి వెళితే, సుదర్శన్ గౌడ్ ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ జరుగుతున్న యుద్ధంలో భాగంగా క్షిపణులు, డ్రోన్ దాడుల కారణంగా అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.సుదర్శన్ గౌడ్ భార్య విజ్ఞప్తి మేరకు, ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం, ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు.ముఖ్యమంత్రి ఆదేశాల




మేరకు, సీఎం సహాయ నిధి (జవీ=ఖీ) నుంచి ఈ మొత్తాన్ని విడుదల చేసేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఐపీఎస్‌లకు కొత్త పోస్టింగ్‌లు!


అమరావతి, అక్టోబర్ 12 (సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 11 మంది ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు (కేటాయించింది. వీరిలో తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు ఇవ్వగా, మరో ఇద్దరికి పూర్తి అదనపు బాధ్యతలు (అప్పగించింది. రాష్ట్ర పరిపాలనలో భాగంగా పలు కీలక శాఖల్లో అధికారుల నియామకాలు చేపట్టింది.ఏపీ భవన్ ఓఎస్‌డీగా సౌరభ్ గౌర్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా మురళీధర్, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా ఆమ్రపాలి, యువజన సేవల సంచాలకుడిగా నీలకంఠరెడ్డి, సామాజిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శిగా తేజ్ భరత్, పౌర సరఫరాల సంస్థ ఎండీగా వరప్రసాద్ యామకంను నియమించినట్లు సమాచారం. పర్యాటకం, గిరిజన సంక్షేమం, యువజన సేవలు, సామాజిక సంక్షేమం, పౌర సరఫరాల వంటి కీలక విభాగాల్లో బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నియామకాలతో ఆయా శాఖల పనితీరు (ూఎఐఅఅఱతీఖ్అశీఅ) మరింత మెరుగుపడుతుందని భావిస్తున్నారు.మిగిలిన అధికారుల పోస్టింగ్‌లు, పూర్తి అదనపు బాధ్యతలు పొందిన ఇద్దరు అధికారుల వివరాలపై అధికారిక ఉత్తర్వుల ద్వారా స్పష్టత రావాల్సి ఉంది.



తిరుపతికి మహర్దశ.. రూ.3,222 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

'తుడా' పరిధిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
శ్రీవారి భక్తుల కోసం భారీ వసతి, అన్నప్రసాద సముదాయాల నిర్మాణం
టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధి
నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించేలా 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం



అమరావతి,అక్టోబర్12(సామాన్యుడి అస్త్రం)

తిరుపతి పుణ్యక్షేత్రం అభివృద్ధిలో మరో కీలక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో మొత్తం రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. అమరావతిలోని తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను నెరవేర్చడం, నగరంలో మౌలిక వసతులను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ ప్రాజెక్టులలో అత్యంత కీలకమైనది ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్. తిరుమల కొండపై రద్దీని తగ్గించే లక్ష్యంతో కొండ కిందనే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో 2,700 గదుల వసతి సముదాయాలను నిర్మించనున్నారు. దీనివల్ల రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి అందుబాటులోకి వస్తుంది. అలాగే, ఒకేసారి 6 వేల మందికి అన్నప్రసాదం అందించేలా రూ.160 కోట్లతో భారీ అన్నప్రసాద కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. రూ.486 కోట్లతో నిర్మించే నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లలో ఒకేసారి 16 వేల మంది భక్తులు స్నానం, విశ్రాంతి తీసుకునే సౌకర్యం కలుగుతుంది. వీటితో పాటు రూ.311 కోట్లతో 4,500 వాహనాలకు సరిపడా బహుళ అంతస్తుల పార్కింగ్, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగమే.మరోవైపు, టీటీడీ ఉద్యోగుల దశాబ్దాల కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో రెండు దశల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.నగర అభివృద్ధిలో భాగంగా, తిరుపతిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ఈ సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో తిరుపతి రూపురేఖలు మారి, ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పవన్ కల్యాణ్ తొలి సినిమాకు 30 ఏళ్లు..



సినీ రంగంలో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న పవన్ కల్యాణ్‌కు అల్లు అరవింద్ అభినందనలు
మన మొదటి సినిమా విడుదలై 30 ఏళ్లు గడిచాయంటే ఆశ్చర్యంగా ఉందన్న అరవింద్
పవన్ సినీ ప్రయాణం ఒక అద్భుతమైన ప్రస్థానమని కొనియాడిన ప్రముఖ నిర్మాత
సినిమాలకు అతీతంగా సమాజం పట్ల పవన్‌కున్న విస్తృత దృష్టిని ప్రత్యేకంగా ప్రశంసించిన అరవింద్

అమరావతి,అక్టోబర్12(సామాన్యుడి అస్త్రం))

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమలో 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రత్యేక లేఖను విడుదల చేశారు. పవన్ కల్యాణ్ సినీ ప్రస్థానం, ఆయన సామాజిక దృక్పథాన్ని ప్రశంసిస్తూ రాసిన ఈ లేఖ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది."ప్రియమైన శ్రీ పవన్ కల్యాణ్ గారికి, మన ఇద్దరి కలయికలో వచ్చిన మొదటి సినిమా విడుదలై 30 సంవత్సరాలు పూర్తయిందని తెలిసి ఆశ్చర్యానికి, దాదాపు షాక్‌కు గురయ్యాను. ఈ పరిశ్రమలో మీరు అద్భుతమైన ప్రయాణాన్ని సాగించారు. 30 ఏళ్లు పూర్తి చేసుకున్న మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని అల్లు అరవింద్ తన లేఖలో పేర్కొన్నారు.పవన్ కల్యాణ్ భవిష్యత్తును ఉద్దేశిస్తూ, "మీరు ఎంచుకున్న మార్గంలో మరిన్ని సంవత్సరాలు విజయం సాధించి, సంతృప్తికరమైన జీవితం గడపాలని నేను ఆకాంక్షిస్తున్నాను. అన్నింటికంటే ముఖ్యంగా, సినిమాలకు అతీతంగా సమాజం పట్ల మీకున్న విస్తృత దృష్టిని, మీరు చేస్తున్న సేవను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని కొనియాడారు. చివరగా, "డియర్ కల్యాణ్, మరోసారి అభినందనలు. నా శుభాకాంక్షలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి" అని అల్లు అరవింద్ తన లేఖను ముగించారు.పవన్ కల్యాణ్ కథానాయకుడిగా పరిచయమైన "అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి" చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన వారి ప్రొఫెషనల్ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, నేడు పవన్ కల్యాణ్ ఒక నటుడిగానే కాకుండా ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో ఉన్న తరుణంలో అల్లు అరవింద్ ఈ లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది.పవన్ కల్యాణ్, సుప్రియ యార్లగడ్డ జంటగా ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం 1996 అక్టోబరు 11న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ తొలి చిత్రంలో పవన్ నటనకు మంచి మార్కులే పడ్డాయి.

11 మంది ఐపీఎస్‌లకు పోస్టింగ్‌లు.. ఆమ్రపాలికి కీలక శాఖ

ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు
ఆగస్టు నుంచి జీపడీలో వెయిటింగ్‌లో ఉన్న ఆమ్రపాలి
తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు
మరో ఇద్దరు ఐపీఎస్‌లకు అదనపు బాధ్యతలు



అమరావతి,అక్టోబర్12((సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.

ఇతర ముఖ్య నియామకాలు ఇలా ఉన్నాయి:

మంజులే బాలాజీ దిగంబర్ (2009 బ్యాచ్): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి.
కె. నీలకంఠ రెడ్డి (2017 బ్యాచ్): యువజన సర్వీసుల డైరెక్టర్. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్. భరణిని తప్పించారు.
బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్): పరిశ్రమలు, వాణిజ్య శాఖలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ విభాగం సంయుక్త కార్యదర్శి.
ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి.
ఎం. వరప్రసాద్: ఏపీ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఈ పోస్టు పూర్తి అదనపు బాధ్యతల నుంచి కె. కన్నబాబుకు విముక్తి లభించింది.
గెదెల శ్రీను కుమార్: స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ డిప్యూటీ సెక్రటరీ.

ఇద్దరికి అదనపు బాధ్యతలు

ప్రస్తుతం ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, పరిశ్రమల డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్‌కు ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది.

జగన్ కేసులపై సోమిరెడ్డి కీలక వ్యాఖ్యలు.. రోజంతా విచారణకు డిమాండ్



రోజువారీ విచారణకు ఈడీ పిటిషన్ వేయడం సరైనదేనని వ్యాఖ్య
డిశ్చార్జి పిటిషన్లతో జగన్ విచారణను ఆలస్యం చేస్తున్నారని ఆరోపణ
తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.43 వేల కోట్లు కూడగట్టారని విమర్శ

అమరావతి,అక్టోబర్12(సామాన్యుడి అస్త్రం)

వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై నమోదైన కేసుల్లో కేవలం రోజువారీ విచారణ మాత్రమే కాకుండా, రోజంతా విచారణ జరగాలని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడాన్ని ఆయన పూర్తిగా సమర్థించారు.ఈడీ పిటిషన్ వేయడం 100 శాతం సరైన చర్య అని, ఇది ఎప్పుడో జరగాల్సిందని సోమిరెడ్డి అన్నారు. ఇది దేశంలోనే అతిపెద్ద అవినీతి కేసు అని ఆయన అభివర్ణించారు. 2011లో సీబీఐ కేసులు నమోదు చేసి 15 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు విచారణ ప్రారంభం కాకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రూ.43 వేల కోట్లకు పైగా అక్రమాస్తులు కూడగట్టారని సోమిరెడ్డి ఆరోపించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుపై నమోదైన కేసులు మూడేళ్లలోనే పూర్తయితే, జగన్ మాత్రం పదేళ్లుగా విచారణ నుంచి తప్పించుకుంటున్నారని విమర్శించారు. డిశ్చార్జి పిటిషన్ల పేరుతో కేసుల విచారణను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇప్పుడు ఈడీ హైకోర్టును ఆశ్రయిస్తే, జగన్ పత్రిక గొంతు చించుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం.. దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన



దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం
రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం
అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులో భారీ వర్షాలు
రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ విస్తారంగా వానలు కురిసే సూచన
ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు

అమరావతి,అక్టోబర్12(సామాన్యుడి అస్త్రం)

దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి. దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది.అక్టోబర్ 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. తమిళనాడులోని అంతర్గత ప్రాంతాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కర్ణాటక తీర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

వెంకటాద్రి యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుమల భక్తుల కోసం 'వెంకటాద్రి' నావిగేషన్ యాప్ ప్రారంభం

రూ.3,222 కోట్లతో తిరుపతిలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం

అలిపిరి వద్ద యాత్రికుల కోసం సమీకృత టౌన్‌షిప్‌కు శంకుస్థాపన

మాస్టర్ ప్లాన్ రహదారులు, టీటీడీ ఉద్యోగుల లేఔట్ పనుల ప్రారంభం

తిరుపతిని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం

అమరావతి,అక్టోబర్12(సామాన్యుడి అస్త్రం)


తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఓ శుభవార్త అందించింది. కొండపైకి వచ్చే యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు, వసతి గదులు, అన్నప్రసాద కేంద్రాలు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా చేరుకునేందుకు 'వెంకటాద్రి' పేరుతో ఒక నూతన నావిగేషన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే, కొండపై ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా ఆఫ్‌లైన్, జీపీఎస్ విధానంలో పనిచేస్తుంది. తెలుగుతో సహా ఐదు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఆధారిత 'గోవింద' వాయిస్ అసిస్టెంట్ సదుపాయం కూడా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది లొకేషన్‌ను ట్రాక్ చేసే సౌకర్యం కల్పించారు. ఆపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ల నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.ఈ వెంకటాద్రి యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన మరిన్ని కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా), టీటీడీ సంయుక్తంగా చేపట్టనున్న రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుపతిని ఒక ఆదర్శ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

అలిపిరి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్

ఈ అభివృద్ధి పనుల్లో అత్యంత కీలకమైనది అలిపిరి వద్ద ఎస్వీ జూపార్క్ రహదారిలో నిర్మించతలపెట్టిన సమీకృత యాత్రికుల టౌన్‌షిప్. దీని నిర్మాణానికి సుమారు రూ.2,750 కోట్లు వెచ్చించనున్నారు. తిరుమల కొండపై వసతుల ఒత్తిడి తగ్గించి, తిరుపతిలోనే భక్తులకు అన్ని సౌకర్యాలు ఒకేచోట కల్పించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో పది అంతస్తుల చొప్పున నాలుగు బ్లాకుల్లో 2,700 గదులను నిర్మించనున్నారు. దీని ద్వారా రోజుకు దాదాపు 16 వేల మందికి వసతి అందుబాటులోకి వస్తుంది. రూ.160 కోట్లతో నిర్మించే అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కారానికి రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని, రూ.90 కోట్లతో సమీకృత రవాణా టెర్మినల్‌ను నిర్మించనున్నారు.

మౌలిక సదుపాయాల విస్తరణ

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల వ్యయంతో 20 కిలోమీటర్ల పొడవున తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ రహదారులు జాతీయ రహదారుల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు, తిరుచానూరు అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటాయి.శ్రీవారి సేవలో నిరంతరం పనిచేసే టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా 418 ఎకరాల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఔట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఔట్లలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఉద్యోగుల కుటుంబాలు సంతోషంగా ఉంటే, వారు మరింత అంకితభావంతో భక్తులకు సేవలందిస్తారని సీఎం అన్నారు.



సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

తిరుమల తరహా పవిత్రతను తిరుపతిలోనూ తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా ఆధ్యాత్మికత, పర్యావరణం, సాంకేతికత, విద్య, ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయాలన్నారు. నగరంలోని చెరువులను అనుసంధానించి సుందరీకరించాలని, 'వృక్షో గోవింద' కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. మెరుగైన మౌలిక సదుపాయాలతో తిరుపతిని వివాహ వేదికలకు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు కేంద్రంగా మార్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు.. నలుగురి సజీవదహనం

విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

ప్రమాదం అనంతరం ఈవీ కారులో చెలరేగిన మంటలు

ఘటనా స్థలంలోనే నలుగురు మృతి, మరొకరి పరిస్థితి విషమం

నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన

మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు

అమరావతి,అక్టోబర్12(సామాన్యుడి అస్త్రం)



విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉందిపోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి

జేఎన్‌యూ ఘటన: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్



కాంగ్రెస్ ఎంపీపై లైంగిక వేధింపుల ఆరోపణలు

నిందిత ఎంపీని కాంగ్రెస్ కాపాడుతోందన్న పురందేశ్వరి

మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శ

అమరావతి,అక్టోబర్12(సామాన్యుడి అస్త్రం)

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో కాంగ్రెస్ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన ఘటనపై ఆ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మౌనంగా ఉండటంపై బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆరోపణ కాదని, నిజమని తేలిన వాస్తవమని ఆమె స్పష్టం చేశారు.ఈ విషయంపై పురందేశ్వరి మాట్లాడుతూ... "జేఎన్‌యూ పరిపాలన విభాగం నియమించిన అంతర్గత విచారణ కమిటీ నివేదికలో, నిందితుడైన కాంగ్రెస్ ఎంపీ 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు స్పష్టంగా తేలింది. కాంగ్రెస్ ఎంపీపై ఇంతటి తీవ్రమైన నేరం రుజువైనప్పటికీ రాహుల్, ప్రియాంక ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం" అని అన్నారు.పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా ప్రచారం చేసే రాహుల్ గాంధీ, ఈ విషయంలో మౌనంగా ఉంటూ నిందితుడికి పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. కనీసం ఒక ప్రకటన కూడా చేయకపోవడం అంటే నిందితుడిని కాపాడటమేనని విమర్శించారు. ఈ దుష్ప్రవర్తనకు పాల్పడిన ఎంపీని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో బహిష్కరించాల్సిందని, కానీ అతనికి రక్షణ కల్పించడం ద్వారా ఆ పార్టీ ద్వంద్వ వైఖరి బయటపడిందని పురందేశ్వరి దుయ్యబట్టారు.మహిళల భద్రత, గౌరవం పట్ల కాంగ్రెస్ నాయకులకు ఉన్న చిత్తశుద్ధిని ఆమె ప్రశ్నించారు. నిందితుడిపై తక్షణమే కఠినమైన చట్టపరమైన, రాజకీయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీజేపీ మహిళా మోర్చా పురందేశ్వరి నేతృత్వంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపట్టింది.

కిలో రూ. 800 పలికే ఈ పండు గురించి తెలుసా?.. సాగుతో ఏపీ రైతు దశ తిరిగింది!

హైదరాబాద్ ఉద్యోగం వదిలి వ్యవసాయంలోకి వచ్చిన యువకుడు

ఎన్టీఆర్ జిల్లాలో గాక్ పండ్ల సాగుతో ఏడాదికి రూ. 30 లక్షల ఆదాయం

మిరప పంట నష్టపోవడంతో ప్రత్యామ్నాయ పంటగా ఎంపిక

మధ్యవర్తులు లేకుండా నేరుగా వినియోగదారులకే విక్రయం

సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న శేషుబాబు

అమరావతి,అక్టోబర్12(రియల్ అడ్వైజర్)



సంప్రదాయ పంటలతో నష్టాలు వస్తున్నాయని చాలామంది రైతులు ఆవేదన చెందుతుంటే, కొందరు మాత్రం వినూత్న ప్రయోగాలతో వ్యవసాయంలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. అలాంటి వారిలో ఒకరే ఎన్టీఆర్ జిల్లాకు చెందిన రైతు బి. శేషుబాబు. హైదరాబాద్‌లోని తన ఉద్యోగాన్ని వదిలి, అరుదైన గాక్ పండ్ల సాగుతో సంవత్సరానికి సుమారు రూ. 30 లక్షల ఆదాయం ఆర్జిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శేషుబాబు, 2020లో హైదరాబాద్‌లోని సామాజిక సంక్షేమ శాఖ ఉద్యోగానికి రాజీనామా చేసి సొంతూరికి తిరిగి వచ్చారు. కుటుంబంతో కలిసి వ్యవసాయం ప్రారంభించారు. అయితే, వాతావరణ మార్పుల కారణంగా మిరప పంటలో తీవ్ర నష్టాలు ఎదుర్కోవడంతో ప్రత్యామ్నాయ పంటల కోసం అన్వేషణ ప్రారంభించారు. ఈ క్రమంలో ఆగ్నేయాసియాకు చెందిన 'గాక్' పండు గురించి తెలుసుకున్నారు. లైకోపీన్, బీటా-కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఈ పండుకు మంచి డిమాండ్ ఉందని గ్రహించారు. వెంటనే వియత్నాం నుంచి దిగుమతి చేసుకున్న మొక్కలను కొనుగోలు చేశారు. 2023 మార్చిలో ఒక్కో మొక్కకు రూ. 700 ఖర్చు చేసి, పావు ఎకరం విస్తీర్ణంలో 100 మొక్కలు నాటారు. కేవలం నాలుగు నెలల్లోనే పంట చేతికి వచ్చింది. తొలి పంటలోనే సుమారు 2,100 కిలోల దిగుబడి రాగా, కిలో రూ. 800 చొప్పున విక్రయించి రూ. 16 లక్షలకు పైగా సంపాదించారు. ఈ విజయంతో ఉత్సాహం పొందిన ఆయన, తన సాగును 75 సెంట్ల భూమికి విస్తరించారు. ప్రస్తుతం ఆయన పొలంలో 300 మొక్కలు ఉండగా, వాటిలో 210 ఆడ మొక్కలు ఉన్నాయి. ఒక్కో ఆడ మొక్క 30 కిలోల వరకు దిగుబడినిస్తోంది. మొత్తం మీద 6,000 కిలోలకు పైగా దిగుబడి సాధిస్తూ, కిలోకు రూ. 500 నుంచి రూ. 600 వరకు విక్రయిస్తున్నారు.గాక్ పండ్ల సాగులో దిగుబడి పెంచడానికి చేతితో పరాగ సంపర్కం చేయాల్సి ఉంటుందని శేషుబాబు తెలిపారు. పూర్తిగా పండిన ఒక్కో కాయ 750 గ్రాముల నుంచి కిలోకు పైగా బరువు తూగుతుంది. ఈ పంటను పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో పండిస్తున్న ఆయన, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని వినియోగదారులకు అమ్ముతున్నారు. గాక్ పండ్లతో పాటు డ్రాగన్ ఫ్రూట్, జామ వంటి ఇతర పంటలను కూడా సాగు చేస్తూ తన వ్యవసాయ క్షేత్రాన్ని వైవిధ్యభరితంగా మార్చుకున్నారు. శేషుబాబు విజయం, సంక్షోభంలో ఉన్న రైతులకు కొత్త దారి చూపుతోంది.

ఏపీ స్థానిక ఎన్నికలు.. మున్సిపాలిటీల రిజర్వేషన్లు ఇవే!

అమరావతి,అక్టోబర్12(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఛైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది

కీరదోస తింటే అనారోగ్యమా?



కీరదోసతో ఆరోగ్యానికి మేలు
కొందరికి జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం
చేదు కీరదోస తినొద్దు
కొందరికి ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం
అరుదుగా అలర్జీ రావచ్చు

ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చాలా మంది కీరదోసకాయను తమ డైట్‌లో చేర్చుకుంటున్నారు. క్యారట్, బీట్‌రూట్‌తో పాటు దీన్నీ పచ్చిగా తినేందుకు ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారు కచ్చితంగా తింటున్నారు.

ఇందులో ఫైబర్, నీటి శాతం ఎక్కువగా ఉండటంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. తరచూ ఏదో ఒకటి తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో క్యాలరీల వినియోగం తగ్గి బరువు నియంత్రణకు తోడ్పడుతుంది. అయితే కీరదోసకాయ అందరికీ ఒకేలా సరిపోదని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరిలో కొన్ని ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందంటున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

జీర్ణకోశ సమస్యలు

కీరలో ఉండే పీచు పదార్థాలు, సహజ రసాయనాలు కొందరిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి, అజీర్ణం వంటి సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా జీర్ణకోశం సున్నితంగా ఉండేవారు ఎక్కువ పరిమాణంలో తింటే ఈ ఇబ్బందులు కనిపించే అవకాశం ఉంటుంది.

చేదుగా ఉంటే జాగ్రత్త

కొన్నిసార్లు దోసకాయ సాధారణం కంటే మరీ చేదుగా ఉంటుంది. దీనికి 'కుకుర్బిటాసిన్స్' అనే సహజ రసాయనాలే కారణం. స్వల్ప మోతాదులో ఇవి ప్రమాదకరం కాకపోయినా, ఎక్కువగా ఉన్న కీర తింటే వికారం, వాంతులు, కడుపు నొప్పి, విరేచనాలు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే చేదుగా అనిపించిన దోసను వెంటనే పారేయడం మంచిది.

ఫుడ్ పాయిజనింగ్

ఇతర పచ్చి కూరగాయల్లాగే కీరపై కూడా హానికర బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంటుంది. సరిగా కడగకుండా లేదా పరిశుభ్రంగా నిల్వ చేయకుండా తింటే ఫుడ్ పాయిజనింగ్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. అలాంటి సమయంలో విరేచనాలు, జ్వరం, వాంతులు, కడుపు మంట, వికారం వంటి లక్షణాలు కనిపించవచ్చు.

అలర్జీ కూడా రావచ్చు

కీరతో అలర్జీ వచ్చే వారు చాలా తక్కువే. అయినా కొందరిలో నోరు, గొంతులో దురద, పెదవులు లేదా నాలుక వాపు, చర్మంపై దద్దుర్లు, గొంతు మంట వంటి లక్షణాలు కనిపించవచ్చు. తీవ్రమైన లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

తరచూ మూత్ర విసర్జన

దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే అధికంగా తింటే సాధారణం కంటే ఎక్కువసార్లు మూత్ర విసర్జన కావచ్చు. ఆరోగ్యంగా ఉన్నవారికి ఇది పెద్ద సమస్య కాదు. కానీ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచనలు పాటించడం మంచిది.

ఇలా తింటే సేఫ్

కీరదోసకాయ తినే ముందు బాగా కడగాలి. శుభ్రమైన, చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి. చేదు రుచి ఉన్న కీర తినకూడదు. మితంగా తీసుకోవాలి. జీర్ణకోశ సమస్యలు ఉన్నవారు తొక్క తీసి తింటే మంచిది.

99 శాతం గుండెపోట్లకు ఈ నాలుగే కారణాలు..



ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలు తీస్తున్న గుండెపోటు, స్ట్రోక్, గుండె వైఫల్యం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎలాంటి హెచ్చరిక లేకుండా అకస్మాత్తుగా రావని, వాటి వెనుక స్పష్టమైన కారణాలుంటాయని ఒక భారీ అంతర్జాతీయ అధ్యయనం తేల్చింది. మొదటిసారి ఇలాంటి సమస్యల బారిన పడిన వారిలో 99 శాతం మందికి, ఆ జబ్బులు రావడానికి కొన్నేళ్ల ముందే నాలుగు ప్రధాన ప్రమాద కారకాల్లో కనీసం ఒకటి ఉన్నట్లు ఈ పరిశోధనలో వెల్లడైంది. అధిక రక్తపోటు (హై బీపీ), అధిక కొలెస్ట్రాల్, రక్తంలో అధిక చక్కెర స్థాయిలు (డయాబెటిస్), పొగాకు వాడకం అనేవి ఆ నాలుగు ప్రమాద కారకాలని పరిశోధకులు గుర్తించారు.సౌత్ కొరియాలోని యోన్సీ యూనివర్సిటీ, అమెరికాకు చెందిన నార్త్‌వెస్టర్న్ మెడిసిన్ పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించారు. దీని కోసం సౌత్ కొరియాలో 93 లక్షల మంది, అమెరికాలో దాదాపు 7,000 మంది వయోజనుల ఆరోగ్య డేటాను సుమారు రెండు దశాబ్దాల పాటు విశ్లేషించారు. గుండె సంబంధిత సమస్యలు వచ్చిన వారిలో 93 శాతం కంటే ఎక్కువ మందికి, ఈ నాలుగింటిలో రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రమాద కారకాలు ముందుగానే ఉన్నట్లు కనుగొన్నారు. ఈ అధ్యయన ఫలితాలు ప్రముఖ 'జర్నల్ ఆఫ్ ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ'లో ప్రచురితమయ్యాయి.ఈ పరిశోధన ప్రకారం, అన్ని ప్రమాద కారకాల్లోకెల్లా అధిక రక్తపోటు అత్యంత సాధారణంగా కనిపించింది. సౌత్ కొరియాలో 95 శాతం, అమెరికాలో 93 శాతం కేసుల్లో బాధితులకు ముందు నుంచే హై బీపీ ఉన్నట్లు తేలింది. సాధారణంగా తక్కువ ప్రమాదం ఉంటుందని భావించే 60 ఏళ్లలోపు మహిళల్లో కూడా ఇదే ధోరణి కనిపించడం ఆందోళన కలిగించే విషయం.ఈ నాలుగు ప్రమాద కారకాలను జీవనశైలి మార్పులు, సరైన మందుల వాడకంతో పూర్తిగా నియంత్రించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రక్తపోటు, కొలెస్ట్రాల్, షుగర్ స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం, పొగాకుకు దూరంగా ఉండటం ద్వారా గుండె జబ్బుల ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. సమస్య తీవ్రం కాకముందే, స్వల్ప స్థాయిలో ఉన్నప్పుడే గుర్తించి జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఈ అధ్యయనం నొక్కి చెబుతోంది.

'బారామాసి' మామిడి మొక్కలు..
బాల్కనీలో పెంచుకోవచ్చు..

పట్టణాల్లో బాల్కనీలు, డాబాలపై బారామాసి మామిడి మొక్కల పెంపకం
ఏడాది పొడవునా కాపునివ్వడమే ఈ రకాల ప్రధాన ఆకర్షణ
నాటిన 12 నెలల్లోనే ఫలసాయం అందించే హైబ్రిడ్ వెరైటీలు
కుండీల్లో పెంచడానికి అనువైన కాటిమోన్, సదాబహార్ రకాలకు ఆదరణ
తీపి రుచి, పీచులేని గుజ్జుతో ఈ పండ్లు ప్రత్యేకం



పట్టణ ప్రాంతాల్లో ఇంటి పంటల సాగుపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో, ప్రస్తుతం అనేకమంది 'బారామాసి' మామిడి రకాలను పెంచేందుకు మొగ్గు చూపుతున్నారు. బాల్కనీలు, డాబాలపై చిన్న కుండీల్లో సైతం ఇవి సులభంగా పెరుగుతూ, ఏడాది పొడవునా ఫలసాయాన్ని ఇస్తుండటంతో వీటికి ఆదరణ విశేషంగా పెరుగుతోంది.'బారామాసి' అంటే హిందీలో పన్నెండు నెలలు అని అర్థం. సాధారణ మామిడి రకాలతో పోలిస్తే, ఇవి ఏడాదిలో పలుమార్లు పూత పూసి కాయలు కాస్తాయి. ముఖ్యంగా అంటుకట్టిన హైబ్రిడ్ మొక్కలు పొట్టిగా ఉండి, కుండీల్లో పెంచడానికి ఎంతో అనువుగా ఉంటాయి. సాంప్రదాయ మామిడి రకాలు నాటిన తర్వాత ఫలసాయం ఇవ్వడానికి సుమారు 4 నుండి 5 ఏళ్ల సమయం పడితే, ఈ బారామాసి రకాలు కేవలం 9 నుండి 12 నెలల్లోనే పంటను చేతికి అందిస్తాయి.ప్రస్తుతం కాటిమోన్ (థాయ్‌లాండ్ రకం), ఎరుపు రంగుతో ఆకట్టుకునే హాంగ్ సియాంగ్ (రెడ్ డ్రాగన్), చీడపీడలను సమర్థవంతంగా తట్టుకునే దేశీయ రకమైన 'సదాబహార్' వంటివి విశేష ప్రాచుర్యం పొందాయి. ఈ మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి నీరు నిల్వ ఉండని సారవంతమైన మట్టి, ప్రతిరోజూ కనీసం 6 నుంచి 8 గంటల పాటు ప్రత్యక్ష సూర్యరశ్మి, తీవ్రమైన చలి నుంచి రక్షణ అవసరం. 20 డిగ్రీల నుంచి 38 డిగ్రీల మధ్య ఉండే ఉష్ణోగ్రతలు వీటికి అత్యంత అనుకూలమని నిపుణులు సూచిస్తున్నారు.ఈ బారామాసి పండ్లు కమ్మని తీపి, స్వల్పమైన పులుపు కలయికతో ఎంతో రుచికరంగా ఉంటాయని సాగుదారులు చెబుతున్నారు. పీచు లేకుండా, ఆకర్షణీయమైన బంగారు పసుపు రంగు గుజ్జుతో ఉండే ఈ పండ్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. సరైన వాతావరణం, తగినంత సంరక్షణ ఉంటే నగరవాసులు సైతం తమ బాల్కనీలు, మిద్దె తోటల్లోనే రసవత్తరమైన మామిడి పండ్లను పండించుకునే అద్భుత అవకాశాన్ని ఈ బారామాసి రకాలు కల్పిస్తున్నాయి.

అన్నం వండే ముందు బియ్యం కడగడం మంచిదా? కాదా?

అన్నం వండే ముందు బియ్యం కడగడంపై నిపుణుల విశ్లేషణ
బియ్యం కడగడం వల్ల అదనపు పిండిపదార్థం, మైక్రోప్లాస్టిక్స్ తొలగిపోతాయి
స్వల్పంగా పోషకాలు నష్టపోయే అవకాశం ఉందని వెల్లడి
ఆర్సెనిక్ తగ్గాలంటే కడగడం కన్నా గంజి వార్చడమే ఉత్తమమని సూచన



అన్నం వండే ముందు బియ్యాన్ని కడగడం దాదాపు అన్ని ఇళ్లలోనూ ఉండే సాధారణ అలవాటు. అయితే ఈ పద్ధతి వల్ల కలిగే లాభనష్టాలపై నిపుణులు కీలక విషయాలను వెల్లడించారు. బియ్యాన్ని కడగడం వల్ల అన్నం పొడిపొడిగా రావడమే కాకుండా, కొన్ని రకాల కాలుష్య కారకాలు కూడా తొలగిపోతాయని వారు చెబుతున్నారు. అదే సమయంలో, స్వల్ప మొత్తంలో పోషకాలు నష్టపోయే అవకాశం ఉందని కూడా వివరిస్తున్నారు.ఆస్ట్రేలియాలోని అడిలైడ్ యూనివర్సిటీకి చెందిన ఆహార శాస్త్రవేత్తల ప్రకారం, బియ్యంపై ఉండే అదనపు పిండి పదార్థం (స్టార్చ్) కడగడం ద్వారా తొలగిపోతుంది. దీనివల్ల అన్నం అతుక్కోకుండా పొడిపొడిగా వస్తుంది. సాగు సమయంలో నీరు, నేల ద్వారా బియ్యానికి చేరే ఆర్సెనిక్ వంటి హానికారకాలు కూడా కొంతవరకు తొలగిపోతాయని ఆహార శాస్త్రవేత్త పర్మల్ డియో తెలిపారు. 2021లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, బియ్యాన్ని కడగడం వల్ల 20 నుంచి 40 శాతం వరకు మైక్రోప్లాస్టిక్స్ కూడా తగ్గుతాయని తేలింది.అయితే, బియ్యాన్ని కడిగే క్రమంలో కాపర్, ఐరన్, జింక్ వంటి నీటిలో కరిగే కొన్ని పోషకాలను కూడా కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, సమతుల్య ఆహారం తీసుకునే వారికి ఈ నష్టం చాలా స్వల్పమని, దీనివల్ల ఆరోగ్యానికి పెద్దగా ఇబ్బంది ఉండదని డైటీషియన్ ఇవాంజెలిన్ మాంట్జియోరిస్ స్పష్టం చేశారు. ప్రస్తుత సూపర్ మార్కెట్లలో లభించే బియ్యం ఇప్పటికే శుద్ధి చేసి వస్తుండటంతో, కేవలం రుచి లేదా కాలుష్యాల తొలగింపు కోసమే కడగాల్సి ఉంటుందని మరో శాస్త్రవేత్త బో వాంగ్ వివరించారు.నిపుణుల సలహా ప్రకారం, రుచి కోసం ఒకటి లేదా రెండు సార్లు బియ్యాన్ని సున్నితంగా కడగడం ఉత్తమం. దీనివల్ల పోషక నష్టం పెద్దగా జరగదు. ఆర్సెనిక్ వంటి హానికారకాల పట్ల ఆందోళన ఉన్నవారు, బియ్యాన్ని కడగడంతో పాటు ఎక్కువ నీటిలో ఉడికించి, గంజిని వార్చివేయడం మేలని శాస్త్రీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ పద్ధతి ద్వారా ఆర్సెనిక్ శాతాన్ని 40 నుంచి 60 శాతం వరకు తగ్గించవచ్చని తేలింది.

చక్కెర పూర్తిగా మానేస్తే ప్రమాదమా?
కొత్త అధ్యయనం ఏం చెబుతోంది

పూర్తిగా మానేయడంపై పరిశోధనల్లో సందేహాలు
పేగుల ఆరోగ్యంపై ప్రభావం
ఇన్సులిన్ నిరోధకత పెరిగినట్లు గుర్తింపు
అధిక చక్కెర మాత్రం హానికరమే
బ్యాలెన్స్‌డ్ ఉత్తమమంటున్న నిపుణులు



బరువు తగ్గాలన్నా, షుగర్‌ను అదుపులో పెట్టాలన్నా చాలా మంది ముందుగా చేసే పని చక్కెరను తగ్గించడం. కొందరైతే పూర్తిగా మానేయడానికే ప్రయత్నిస్తారు. చక్కెర ఎంత తక్కువగా తీసుకుంటే అంత మంచిదనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. అయితే చక్కెరను పూర్తిగా ఆహారం నుంచి తొలగించడం వల్ల కూడా కొన్ని అనుకోని సమస్యలు రావొచ్చని తాజా అధ్యయనం చెబుతోంది. అమెరికాలో జరిగిన ఎండో 2026 సదస్సులో వెల్లడైన ఈ పరిశోధన ప్రస్తుతం ఆసక్తికర చర్చకు దారితీసింది.

చక్కెర లేకపోతే ఏమైంది?

పరిశోధకులు ఎలుకలను రెండు గ్రూపులుగా విభజించి 16 వారాల పాటు అధ్యయనం చేశారు. ఒక గ్రూపునకు చక్కెర ఉన్న తక్కువ కొవ్వు ఆహారం ఇవ్వగా మరో గ్రూపునకు చక్కెర లేని అదే తరహా ఆహారం అందించారు. తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు, ఇన్సులిన్ పనితీరు, పేగుల్లోని సూక్ష్మజీవులు, కాలేయ ఆరోగ్యం వంటి అంశాలను పరిశీలించారు. ఆశ్చర్యకరంగా, చక్కెర పూర్తిగా మానేసిన ఎలుకల్లో బరువు పెద్దగా తగ్గలేదు. పైగా రక్తంలో చక్కెర నియంత్రణ దెబ్బతినడం, ఇన్సులిన్ నిరోధకత పెరగడం, పేగుల ఆరోగ్యం బలహీనపడడం, కాలేయంలో వాపు వంటి సమస్యలు కనిపించాయి. దీంతో చక్కెరను పూర్తిగా తొలగించడం సరైన నిర్ణయం కాకపోవచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

పేగుల ఆరోగ్యంతో సంబంధం ఏంటి?

మన పేగుల్లో లక్షల కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి. ఇవే జీర్ణక్రియ నుంచి రోగనిరోధక శక్తి వరకు అనేక పనుల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ సూక్ష్మజీవుల బ్యాలెన్స్ దెబ్బతింటే ఊబకాయం, మధుమేహం, కాలేయ సమస్యల వంటి అనారోగ్య పరిస్థితులు వచ్చే ప్రమాదం ఉంటుంది. చక్కెరను పూర్తిగా మానేసిన ఎలుకల్లో ఈ సమతుల్యతలో మార్పులు కనిపించినట్లు అధ్యయనం వెల్లడించింది.

అంటే చక్కెర ఎక్కువగా తినాలా?

అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల ఊబకాయం, టైప్-2 డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ అధ్యయనం చెప్పేది ఒక్కటే. చక్కెరను అధికంగా తీసుకోవడం హానికరం. అలాగే పూర్తిగా మానేయడం కూడా కొన్ని సందర్భాల్లో ప్రతికూల ప్రభావాలు చూపవచ్చు. అందుకే బ్యాలెన్స్‌డ్ డైట్ ఉత్తమమని పరిశోధకులు సూచిస్తున్నారు.

ఈ అధ్యయనం ఎలుకలపై మాత్రమే జరిగింది. మనుషులపై మరింత లోతైన పరిశోధనలు జరగాల్సి ఉంది.



నితిన్‌కి జోడీగా?

లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒకరాజు చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకున్నది హర్యానా అందం మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నాగచైతన్యకు జోడీగా 'వృషకర్మ' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్న మీనాక్షికి మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ టాక్ బలంగా వినిపిస్తున్నది. సామజవరగమన' వంటి బ్లాక్‌బస్టర్ తెరకెక్కించిన రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నితిన్ హీరోగా ఓ రొమాంటిక్ కామెడీ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈసినిమాలో కథానాయికగా మీనాక్షి చౌదరి ఖరారైనట్టు వినికిడి. అయితే.. దీనిపై అధికారిక స్పష్టత రావాల్సివుంది. జనవరిలో సెట్స్‌పైకి వెళ్లే ఈసినిమాను ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించనున్నట్టు సమాచారం.

'జైలర్ 2' హిందీ రిలీజ్‌పై క్లారిటీ.. వదంతులకు మేకర్స్ చెక్



సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న 'జైలర్ 2' చిత్ర హిందీ విడుదలపై కొన్ని రోజులుగా వస్తున్న వదంతులకు చిత్రబృందం తెరదించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 15న ఈ సినిమా హిందీ వెర్షన్ థియేటర్లలో విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం చిత్ర నిర్మాతలు అధికారిక ప్రకటన విడుదల చేశారు.'జైలర్ 2' హిందీలో విడుదల కావడం లేదంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని మేకర్స్ వెల్లడించారు. హిందీ వెర్షన్ విడుదలలో ఎటువంటి మార్పులు లేవని, ఉత్తర భారతంలో ఈ చిత్రాన్ని 'పెన్ మరుధర్ ఎంటర్‌టైన్‌మెంట్' సంస్థ పంపిణీ చేయనుందని పేర్కొన్నారు. ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని ఈ సందర్భంగా మీడియా సంస్థలను కోరారు.

నిరసనలో గాయాలు



ముంబైలో జరిగిన సీజేపీ నిరసనలో పాల్గొని పోలీసుల అదుపులోకి వెళ్లిన బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మేనకోడలు, నటి జైన్ మేరీ ఖాన్ తనకు అయిన గాయాలను చూపిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను పంచుకున్నారు. ఈ పరిణామం ఒకవైపు చర్చనీయాంశం కాగా, మరోవైపు ఇదే నిరసనలో పాల్గొన్న అమీర్ ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్‌పై కేసు నమోదు చేయాలని బీజేపీ నేత కిరీట్ సోమయ్య పోలీసులను ఆశ్రయించడం సంచలనంగా మారింది.శనివారం ముంబైలోని ఆగస్ట్ క్రాంతి మైదాన్‌లో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఒక నిరసన కార్యక్రమం జరిగింది. ఎన్నికల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో పాల్గొన్న జైన్ మేరీ, ఇమ్రాన్ ఖాన్, నటి లేఖా వాషింగ్టన్‌తో పాటు 400 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొన్ని గంటల తర్వాత వారిని విడుదల చేశారు.

క్యూట్ లవ్ స్టోరీతో.. హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్న ప్రముఖ హీరో కుమార్తె



ప్రముఖ టాలీవుడ్ హీరో శ్రీకాంత్ కుమార్తె మేధ త్వరలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఓ క్యూట్ లవ్ స్టోరీతో ఆమె పరిచయం కానున్నారు. 'మైత్రీ ఇన్ లవ్' అనే సినిమాతో ఇండస్ట్రీని పలకరించనున్నారు. ఈ సినిమాతో జై జాస్తి కూడా హీరోగా పరిచయం కానున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది. ఇక ఈ సినిమాకి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. అంతేకాదు.. సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు కూడా త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. అయితే మేధ వెండితెరకు కొత్తేం కాదు. అనుష్క ప్రధాన పాత్రలో వచ్చిన 'రుద్రమదేవి' చిత్రంలో చిన్నప్పటి రుద్రమదేవి పాత్రలో ఆమె కనిపించి మెప్పించారు. ఇక శ్రీకాంత్ తనయుడు రోషన్ నటుడిగా అలరిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం శైలేష్ కొలను దర్శకత్వంలో 'ఏమో ఏమో ఇది' అనే రొమాంటిక్ లవ్ స్టోరీలో నటిస్తున్నారు.

2027 వరల్డ్ కప్ గెలవాలంటే టీమిండియాకు అదే కీలకం

2027 ప్రపంచకప్‌పై విశ్లేషణ చేసిన మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్
దక్షిణాఫ్రికాలో పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటాయని అంచనా
మెరుగైన బౌలింగ్ ఉన్న జట్టే ప్రపంచకప్ గెలుస్తుందని వ్యాఖ్య
ఒక్క ఆటగాడితో ప్రపంచకప్ గెలవడం సాధ్యం కాదని స్పష్టీకరణ
భారత్ గెలవాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ మెరుగుపరుచుకోవాలని సూచన





దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాల ఆతిథ్యంలో 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్‌పై భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. గతంతో పోలిస్తే దక్షిణాఫ్రికాలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, అక్కడ పిచ్‌లు ఇప్పుడు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నాయని విశ్లేషించాడు. ఈ నేపథ్యంలో బ్యాటర్లు ఆధిపత్యం చెలాయించే అవకాశం ఉన్నందున, ఏ జట్టుకైతే పటిష్ఠమైన బౌలింగ్ దళం ఉంటుందో అదే విజేతగా నిలుస్తుందని జోస్యం చెప్పాడు. 'హిందుస్థాన్ స్పోర్ట్స్'తో మాట్లాడుతూ కైఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు."దక్షిణాఫ్రికాలో ఇప్పుడు పరిస్థితులు చాలా మెరుగయ్యాయి. అక్కడ బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌లు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శిస్తారని నేను అనుకోవడం లేదు. బ్యాటర్లే రాణిస్తారు. అందుకే, ఏ జట్టులో అత్యుత్తమ బౌలర్లు ఉంటారో, వారే విజయం సాధిస్తారు" అని కైఫ్ వివరించాడు. 2027 నాటికి విరాట్ కోహ్లీకి 39, రోహిత్ శర్మకు 40 ఏళ్లు రానున్న నేపథ్యంలో వారి భాగస్వామ్యంపై నెలకొన్న అనిశ్చితిపై కైఫ్ స్పందించాడు. "అందరి దృష్టి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలపైనే ఉంది. వారిద్దరూ బాగానే ఆడతారని నేను భావిస్తున్నా. కానీ, భారత్ ప్రపంచకప్ గెలవాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలను కచ్చితంగా సరిదిద్దుకోవాలి. ఈ రెండు అంశాలే అత్యంత కీలకం" అని అన్నాడు.విదేశాల్లో ఒక్క ఆటగాడు మాత్రమే ప్రపంచకప్‌ను గెలిపించలేడని, జట్టుగా రాణించడం ముఖ్యమని కైఫ్ నొక్కిచెప్పాడు. "కోహ్లీ ప్రధాన ఆటగాడే అయినా, మిగిలిన వారు కూడా రాణిస్తేనే జట్టుకు సహాయం అందుతుంది" అని పేర్కొన్నాడు.

రంజీ ట్రోఫీ: హ్యాట్రిక్‌తో దేశ్‌పాండే, సెంచరీతో జడేజా అదుర్స్!



దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో సోమవారం పలు ఆసక్తికర పోరాటాలు జరిగాయి. ముంబై పేసర్ తుషార్ దేశ్‌పాండే హ్యాట్రిక్‌తో చెలరేగగా, సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా సెంచరీతో మెరిశాడు. ఇతర మ్యాచ్‌లలో కూడా పలువురు ఆటగాళ్లు శతకాలతో సత్తా చాటారు.

వాంఖడేలో దేశ్‌పాండే హ్యాట్రిక్ మ్యాజిక్

ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా చండీగఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై పేసర్ తుషార్ దేశ్‌పాండే అద్భుత ప్రదర్శన చేశాడు. తన హ్యాట్రిక్‌తో పాటు మొత్తం 5 వికెట్లు (5/17) పడగొట్టి చండీగఢ్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. అతనికి మోహిత్ అవస్థి (3/9) తోడవడంతో చండీగఢ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 78 పరుగులకే ఆలౌట్ అయింది. అంతకుముందు ముంబై తమ తొలి ఇన్నింగ్స్‌లో 429 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో చండీగఢ్‌పై ఫాలో-ఆన్ విధించిన ముంబై, రెండో ఇన్నింగ్స్‌లోనూ దేశ్‌పాండే దెబ్బకు తొలి బంతికే ఒక వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది.

శతకంతో మెరిసిన జడేజా

రాజ్‌కోట్‌లో ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సౌరాష్ట్ర స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కీలక సెంచరీ నమోదు చేశాడు. సోమవారం 72 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన జడేజా, మొత్తం 209 బంతుల్లో 7 ఫోర్లతో 102 పరుగులు చేసి ఔటయ్యాడు. అదే జట్టుకు చెందిన ప్రేరక్ మన్కడ్ కూడా 129 పరుగులతో రాణించడంతో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 392 పరుగులకు ఆలౌటైంది.

రంజీ ట్రోఫీకి అన్యాయం..



భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీకి ప్రాధాన్యత ఇవ్వకుండా, అదే సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌లను షెడ్యూల్ చేయడాన్ని ఆయన తప్పుబట్టాడు. ఈ విధానం వల్ల దేశవాళీ టోర్నీ ప్రాధాన్యతను బీసీసీఐయే తగ్గిస్తోందని ఆయన విమర్శించాడు.రంజీ ట్రోఫీ సీజన్ కొనసాగుతుండగా ఇండియా 'ఏ' మ్యాచ్‌లు నిర్వహించడం వల్ల చాలా మంది కీలక ఆటగాళ్లు తమ రాష్ట్ర జట్లకు అందుబాటులో ఉండటం లేదని గవాస్కర్ అన్నాడు. ఇటీవలే ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన మ్యాచ్ కారణంగా రజత్ పటిదార్, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి ఆటగాళ్లు తమ జట్ల తొలి రంజీ మ్యాచ్‌లకు దూరమయ్యారని గుర్తుచేశాడు. త్వరలో జరగనున్న న్యూజిలాండ్ 'ఏ' పర్యటనతో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు.

బ్యాటర్ మనసు చదివేస్తా

వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో అద్భుత ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించిన యువ ఆల్-రౌండర్ నమన్ ధీర్, తన బౌలింగ్ వ్యూహాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. బ్యాటర్ ఉద్దేశాలను ముందే పసిగట్టడం వల్లే బంతిని ఎలా సంధించాలనే దానిపై నిర్ణయాలు తీసుకుంటానని తెలిపాడు. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 14 పరుగుల తేడాతో గెలిచి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో నిలిచింది.ఈ మ్యాచ్‌లో 224 పరుగుల లక్ష్య ఛేదనలో ప్రమాదకరంగా మారుతున్న షిమ్రాన్ హెట్మెయర్, కమిల్ పూరన్‌లను ఔట్ చేసి ధీర్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ.. తన బౌలింగ్ ప్రణాళికలను వివరించాడు. "ఒక ఆఫ్-స్పిన్నర్‌గా నా వద్ద ఎక్కువ వేరియేషన్లు ఉండవు. అందుకే లైన్ అండ్ లెంగ్త్, పేస్ మార్పులపైనే ఎక్కువగా ఆధారపడతాను. టీ20 క్రికెట్‌లో వికెట్ తీయడం కంటే గొప్ప విషయం మరొకటి లేదు. దాడి చేయడమే కొన్నిసార్లు ఉత్తమ రక్షణ అవుతుంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.